సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 25 । డిసెంబర్ । 2023



వెంకన్నగా... అప్పన్న


సింహాచలం: రాపత్తు ఉత్సవాల్లో భాగంగా సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు.



అపురూపం..ఆ మందిరం

ఏజెన్సీలోని మొట్టమొదటి చర్చిగా గుర్తింపు పొందిన సుంకరమెట్టలోని క్రైస్తవప్రార్థనా మందిరానికి 84 ఏళ్ల చరిత్ర ఉంది. 8లో

వైభవంగా మార్గశిర పూజలు



విశాఖపట్నంలోని కనకమహాలక్ష్మి అమ్మ వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, వైభవంగా పూజలు నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌కు ఘన సన్మానం



శుభం బన్సల్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ యూనియన్ నాయకులు

రంపచోడవరం: సబ్ కలెక్టర్‌గా శుభం బన్సల్ విశేష సేవలు అందించారని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.శ్రీమన్నారాయణ అన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పనిచేసి తిరుపతి జేసీగా బదిలీపై వెళుతున్న శుభం బన్సల్‌ను ఆదివారం డివిజన్‌లోని రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏవో మడకం సావిత్రి, తహసీల్దార్లు రాజు, చిన్నం శ్రీనివాసరావు, సత్య నారాయణ,రెవెన్యూ యూనియన్ డివిజన్ కార్యదర్శి ఫయాజ్ బాషా (జిలాని) తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



దేగలపుట్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే మార్గంలో జర్రెల పంచాయతీ దేగలపుట్టు జంక్షన్ వద్ద ఆదివారం స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అనుమానితులను ప్రశ్నించి విడిచి పెట్టారు. బ్యాగులు, లగేజీలను పరిశీలించారు. వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులు ఉండాలని, అధిక లోడు, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

హుకుంపేట: ఒడిశా ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 60 కిలోల గంజాయిని ఆదివారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని దాలిగుమ్మడి జంక్షన్ సమీపంలో ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో కామయ్యపేట రోడ్డులో ఒడిశా ప్రాంతం నుంచి వచ్చిన కారును తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. గంజాయి, కారును స్వాధీనం చేసుకుని, కారులో ప్రయాణిస్తున్న చంద్రాయణ గుట్ట(హైదరాబాద్)కు చెందిన మహమ్మద్ మిస్బ ఉద్దీన్, మహమ్మద్ క్వాజ వహా నక్బంది, అరికెల సాయికుమార్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మరో 11 మందికి కరోనా

మహారాణిపేట(విశాఖ): మరో 11 మందికి కరోనా సోకింది. దీంతో కేసుల సంఖ్య 18కి చేరుకుంది. ఈ 11 మంది నుంచి నమూనాలు సేకరించి... జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపినట్లు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 34 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో 11 మందికి కరోనా నిర్ధారణ అయినట్లు చెప్పారు. కేజీహెచ్ నిర్వహించిన పరీక్షల్లో 8 మందికి, ప్రైవేట్ ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. వీరిలో కైలాసపురం, ఆనందపురం, కంచరపాలెం, రామ్‌నగర్, సబ్బవరం, డెంకాడ(విజయనగరం), శ్రీకాకుళం, అనపర్తికి చెందిన ఒక్కొక్కరు, అనకాపల్లికి చెందిన ముగ్గురు ఉన్నారు.

జూకి రూ.8.86 లక్షల ఆదాయం

ఆరిలోవ(విశాఖ): విశాఖ జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. అధిక సంఖ్యలో సందర్శించారు. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు వద్ద సరదాగా గడిపారు. మొత్తం 9,723 మంది సందర్శించగా.. రూ 8.86 లక్షలు ఆదాయం చేకూరినట్టు జూక్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

క్రిస్మస్ శోభ

ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ పండగకు ముస్తాబయ్యాయి. విద్యుత్‌కాంతుల వెలుగులతో మెరిసిపోతున్నాయి. నగర సంకీర్తనలు ఆధ్యాత్మిక సౌరభాన్ని పంచాయి. పలువురు శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులను అలరించారు. ఆదివారం సాయంత్రం నుంచి చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. కరుణామయుడు అవతరించిన వేళ అర్ధరాత్రి అందరూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

- విద్యుత్‌దీపాల అలంకరణలో చర్చిలు
- ట్రీ, స్టార్లతో ఇళ్లు ముస్తాబు
- సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు



హుక్కాగూడ సీఎస్‌ఐ చర్చి



పాడేరులో కేరల్స్ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పాడేరు: క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని అన్ని క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. పాడేరు పట్టణంలోని సీబీఎం చర్చి, సుంకరమెట్ట సీబీఎం చర్చి, అనంతగిరి మండలం హుక్కాగూడ వద్ద సీఎస్‌ఐ చర్చిలతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న ఆర్‌సీఎం, లూథరన్, ఇతర అన్ని చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక విద్యుత్ దీపాఅలంకరణ చేశారు. క్రైస్తవులు తమ నివాసాల వద్ద క్రిస్మస్ ట్రీలు, వెల్‌కమ్ బోర్డులు, స్టార్‌లతో చూడముచ్చటగా అలంకరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకోనున్నారు.

పాడేరు పట్టణంలో క్రైస్తవ సంకీర్తన

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పాడేరులో ఆదివారం సాయంత్రం ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం పాస్టర్ తిమోతి ఆధ్వర్యంలో క్రిస్మస్ తాత వేషధారణలో క్రైస్తవ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం సినిమాహాల్ సెంటర్, పాత బస్టాండ్, మెయిన్ బజారు మీదుగా సుండ్రుపుట్టు వరకు సాగింది. ఆదివారం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు



పాడేరు పట్టణంలో విద్యుత్‌దీపాలంకరణలో కారుణ్య ప్రార్థనా మందిరం

క్రిస్మస్ శుభాకాంక్షలు

క్రిస్మస్‌ను పురస్కరించుకుని కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిలోపల ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

ఉత్సాహంగా 3కే రన్

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర, సచివాలయ సిబ్బంది



రన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి/అడ్డతీగల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ పలు ప్రాంతాల్లో ఆదివారం 3 కె రన్, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రాజవొమ్మంగిలో స్థానిక ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు నేతృత్వంలో 3కే రన్ నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఉత్సాహంగా రన్ సాగింది. అధికారులు, ఔత్సాహిక క్రీడాకారులు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మానవహారం నిర్వహించి, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు. అడ్డతీగలలో ఎంపీడీవో కె.బాపన్నదొర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జనవరి 9 వరకు గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఖోఖో, వాలీబాల్, క్రికెట్,షటిల్ తదితర పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సాధికార బస్సుయాత్ర విజయవంతానికి కృషి

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పాల్గుణ, నాయకులు

అరకులోయటౌన్: హుకుంపేట మండలంలో ఈనెల 29న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో నిర్వహించే బస్సుయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి జనసమీకరణకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు లోక్కోయి లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ ఎల్.బి. భీమరాజు, సర్పంచ్ భాస్కరరావు, మండలపార్టీ కన్వీనర్ పట్టాసి సంపత్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి గోపాలరావు, మండల మహిళా అధ్యక్షురాలు సుమిత్ర, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.బి. కిరణ్ కుమార్, ముఖీ సాంబయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.

27న అరకులోయలో అప్పన్న శాంతి కల్యాణం



ప్రచార రథం వద్ద వివరాలు తెలియజేస్తున్న సింహాద్రిమఠం గురుస్వామి సురేంద్రస్వామి

సింహాచలం: ఈనెల 27న అరకులోయలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు సింహాచలంలోని సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి ఆదివారం తెలిపారు. రెండు వేల మంది గిరిజన దీక్షాధారులు, భక్తులతో ఈ కల్యాణం జరుగుతుందని చెప్పారు. సింహాచలం దేవస్థానం సౌజన్యంతో సింహాద్రి మఠం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భాగంగా దేవస్థానానికి చెందిన ప్రచార రథం అరుకులోయ వెళ్తుందని తెలిపారు. లోతేరు వెళ్లే మార్గంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శాంతికల్యాణం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఉదయం 9 గంటల నుంచి గిరిజన దీక్షాధారులు, భక్తులతో పద్మాపురం జంక్షన్ నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు ప్రచార రథంతో తిరువీధి నిర్వహించనున్నట్టు చెప్పారు. సింహాద్రిమఠం తరఫున దీక్షాదారులకు కంకణాలు(రక్షలు) అందిస్తామని తెలిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులంతా పూజల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని సురేంద్రస్వామి పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి



సుబ్బలక్ష్మి (ఫైల్)

రంపచోడవరం: మండల కేంద్రం రంపచోడవరానికి సమీపంలోని పెద్దగెద్దాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగవరం మండలం జియ్యంపాలెం పంచాయతీ సర్పంచ్ కంగల సుబ్బలక్ష్మి(55) మృతి చెందారు. మారేడుమిల్లిలోని ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న మనవడిని చూసేందుకు ఆదివారం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బలక్ష్మి తన మరో మనువడు చైతన్యతో కలిసి మారేడుమిల్లిలో ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మనవడు కౌశిక్‌ను చూసేందుకు రంపచోడవరం నుంచి ఆటోలో బయలుదేరారు. పెద్దగెద్దాడ పీహెచ్‌సీ వద్ద మారేడుమిల్లి వైపు నుంచి వస్తున్న కారు, వీరు ప్రయాణిస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్బలక్ష్మిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందారు. చైతన్యకు స్వల్ప గాయాలు కావడంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటో డ్రైవర్ ఉంగరాల శ్రీనును కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొగ్గు నిల్వలతో పోర్టు హౌస్‌ఫుల్

విశాఖపట్నం పోర్టు.. బొగ్గు నిల్వలతో నిండిపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 1.4 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు పేరుకుపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి దిగుమతి చేసుకున్న కోల్ ధరతో పోలిస్తే.. దేశీయ బొగ్గు తక్కువ ధరకు లభిస్తోంది. దీంతో విదేశాల నుంచి వచ్చిన బొగ్గును కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మరో రెండు రోజుల్లో ఇంకో లక్ష టన్నులు వచ్చే అవకాశం ఉండటంతో.. ఏం చేయాలో తెలీక.. అటు ట్రేడర్స్, ఇటు పోర్టు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. – సాక్షి, విశాఖపట్నం

- విదేశాల నుంచి వచ్చిన బొగ్గును కొనుగోలు చేయని సంస్థలు
- దేశీయ బొగ్గుతో పోలిస్తే ధర దాదాపు రెట్టింపు ఉండటమే కారణం
- ఇప్పటికే పోర్టులో 1.4 మిలియన్ టన్నుల నిల్వ
- రెండు రోజుల్లో లక్ష టన్నులతో రెండు కార్గో షిప్స్ వచ్చే అవకాశం



పేరుకుపోయిన బొగ్గు నిల్వలు

విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర సంస్థలకు అవసరమైన థర్మల్, కోకింగ్, స్టీమ్ కోల్‌ని విశాఖపట్నం ట్రస్టు హ్యాండ్లింగ్ చేస్తుంటుంది. ఏటా సుమారు 2 మిలియన్ టన్నుల థర్మల్, 7మిలియన్ టన్నుల కోకింగ్, 10 మిలియన్ టన్నుల స్టీమ్ కోల్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు జరుగుతుంటాయి. మొత్తంగా పోర్టు కార్గో హ్యాండ్లింగ్‌లో కోల్ వాటా దాదాపు 25 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. విశాఖకు చెందిన కొందరు వెండర్స్.. ఇక్కడ అవసరాలకు అనుగుణంగా దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటారు. వాటిని పోర్టులో హ్యాండ్లింగ్ చేసి.. ఆయా పరిశ్రమల డిమాండ్ మేరకు విక్రయిస్తుంటారు. అయితే కొద్ది నెలలుగా పోర్టులో కోల్ నిల్వలు అమాంతం పెరిగిపోతున్నాయి.

దేశీయ బొగ్గే మేలని.. : ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, చైనా దేశాల నుంచి పోర్టుకు స్టీమ్ కోల్ దిగుమతి అవుతుంటుంది. ఇందులో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా నుంచి వస్తున్న బొగ్గు అత్యంత నాణ్యమైంది కావడంతో దానికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. విశాఖ, ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది ట్రేడర్స్ వీటిని ఆయా దేశాల్లో కొనుగోలు చేసి.. ఇక్కడి తీసుకొస్తుంటారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్టీమ్ కోల్ ధర పెరిగింది. దీంతో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కోల్ ధర విశాఖ పోర్టుకి చేరుకునే సరికి టన్నును రూ.9000 నుంచి రూ.9500 వరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కోల్ ఇండియా సంస్థ నేరుగా విక్రయాలు ప్రారంభించింది. ఎవరైనా ఆర్డర్ పెడితే.. కోల్ ఇండియా సంస్థే స్టీమ్ కోల్‌ను తీసుకొస్తోంది. దీంతో దేశీయబొగ్గు టన్నుధర విశాఖ చేరే సమయానికి రూ.5,200 నుంచి రూ.5,800 వరకు పలుకుతోంది. విదేశీ బొగ్గు ధరతో పోలిస్తే దాదాపు రూ.4000 వరకు తక్కువ. ఈ పరిస్థితుల్లో బొగ్గు అవసరమైన సంస్థలు దేశీయ బొగ్గు కొనుగోలుకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో విదేశాల నుంచి వస్తున్న స్టీమ్ కోల్ నిల్వలు పోర్టులో పేరుకుపోతున్నాయి. ఇతర దేశాల నుంచి కోల్ తీసుకురావాలంటే 3 నుంచి 6 నెలల ముందుగానే ట్రేడర్లు ఆర్డర్లు పెట్టాలి. దానికనుగుణంగా కార్గోషిప్స్ ఇక్కడికి బయలుదేరుతాయి. ఇక్కడ కొనుగోళ్లు జరగకపోతున్నా.. వాటిని ఆపలేని పరిస్థితి నెలకొంది. దీంతో వస్తున్న నౌకల నుంచి కోల్‌ను దిగుమతిచేసి పోర్టులో నిల్వగా ఉంచేస్తున్నారు.


ఇప్పటివరకు పోర్టులో 1.4 మిలియన్ టన్నుల ఇంపోర్టెడ్ స్టీమ్ కోల్ నిల్వలు పేరుకుపోయాయి. గత నెల రోజులుగా ట్రేడర్లు ఎవరూ ఆర్డర్లు పెట్టకపోవడంతో ఆయా దేశాల నుంచి బొగ్గు దిగుమతి ఆగిపోయింది. గతంలో పెట్టిన ఆర్డర్ల మేరకు రెండు నౌకల నుంచి దాదాపు లక్ష టన్నుల స్టీమ్‌కోల్‌తో ఈ వారంలో పోర్టుకు చేరుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే పోర్టంతా బొగ్గుమయం అయిపోగా.. ఇప్పుడు వస్తున్న షిప్స్ నుంచి ఎలాదిగుమతి చేసుకోవాలి. ఎక్కడ.. ఎన్ని రోజులు నిల్వ ఉంచాలంటూ అటు ట్రేడర్లు, ఇటు పోర్టు అధికారులు ఆలోచిస్తున్నారు.

తొలి సంధ్యవేళలో.. తెలి మంచుధారల్లో..

- పర్యాటకుల జోష్
- టూరిస్టు స్పాట్లు కిటకిట
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్



చాపరాయి వద్ద సందర్శకుల సందడి



వంజంగిలో అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

పాడేరు/డుంబ్రిగుడ/జి.మాడుగుల/కొయ్యూరు/అరకులోయ/చింతపల్లిరూరల్: జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. వరుస సెలవులు రావడంతో పలు ప్రాంతాల నుంచి టూరిస్టులు పెద్ద సంఖ్యలో వచ్చి సందడి చేశారు. తెల్లని మంచు పడుతుండగా ఆ చలిగిలిలో తెల్లవారుజాము నాలుగు గంటలకే పలువురు పర్యాటల ప్రాంతాలకు చేరుకుని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించి పరవశించిపోయారు. డుంబ్రిగుడ మండలంలో చాపరాయి, జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి, కొయ్యూరు మండలంలో చింతవానిపాలెం సమీపంలో ఉన్న జలపాతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో వాహనాలతో రావడంతో అరకు–పాడేరు జాతీయ రహదారి, జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతానికి వెళ్లే రోడ్డులో కొంత ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జలపాతాల వద్ద అన్ని వయస్సుల వారు కేరింతలతో ఉల్లాసంగా జలకాలాడారు. రోజంతా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆటపాటలతో హాయిగా గడిపారు.

- అరకులోయ మండలంలో మాడగడ సన్ రైజ్ వ్యూ పాయింట్ వద్ద ప్రకృతి అందాలు, మంచు సోయగాలను తిలకించి పర్యాటకులు పరవశించిపోయారు. సెల్ ఫోన్లలో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.
- చింతపల్లి మండలంలో చెరువులవేనం పర్యాటకులతో కిటకిటలాడింది. లంబసింగి, తాజంగి తదితర ప్రాంతాలు సందర్శకులతో సందడిగా మారాయి.
- ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి మేఘాల కొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. వేకువ జామున సూర్యోదయపు అందాలతో పాటు మంచు మేఘాల సోయగాలను తనివితీరా ఆస్వాదించారు. అధిక సంఖ్యలో పర్యాటకుల వాహనాలు కొండపై రహదారికి అటుఇటుగా అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయ ఏర్పడింది. ఆదివారం వంజంగి కొండను రికార్డు స్థాయిలో సుమారు 5 వేల మంది పర్యాటకులు సందర్శించారని అక్కడి స్థానికులు తెలిపారు.



చింతవాని పాలెం వద్ద...



కొత్తపల్లి జలపాతం వద్ద ..



మాడగడ వ్యూ పాయింట్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు టూరిస్టులు పోటెత్తారు. శనివారం బొర్రా గుహలను 6వేల మంది పర్యాటకులు సందర్శించగా, రూ.6 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం 10వేల మంది సందర్శించగా సుమారు రూ.8 లక్షల వరకు ఆదాయం లభించింది. పర్యాటకుల రాకతో బొర్రాగుహల ప్రాంగణమంతా సందడిగా మారింది. వారం రోజులుగా సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో కళకళలాడతున్నాయి.



బొర్రాగుహల వద్ద పర్యాటకులు

ముమ్మరంగా ధాన్యం కొనుగోలు

- అనకాపల్లి జిల్లాలో 72 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ
- లక్ష్యం 70 మెట్రిక్ టన్నులు
- తొలివిడతలో 40 వేల మెట్రిక్ టన్నులు
- 20 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ
- నాతవరం, దేవరాపల్లిలో ప్రారంభమైన కొనుగోలు
- ఏ-గ్రేడ్ రూ.2,183, బి-గ్రేడ్ రకం రూ.2,203


నాతవరం మండలం గునిపూడి గ్రామంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది


ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది


దేవరాపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ, పౌరసరఫరాల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సేకరిస్తున్నాయి.

మొదటి విడతలో 40 వేల మెట్రిక్ టన్నులు

జిల్లాలో 72 ఆర్‌బీకే కేంద్రాల పరిధిలో 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతలో 40 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనుంది. ఇప్పటివరకూ 110 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 57 పీఏసీఎస్‌లు, 15 ఫార్మర్స్ ఆర్గనైజేషన్ల నుంచి సేకరించిన ధాన్యాన్ని 26 రైస్ మిల్లర్లకు రవాణా చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 250 ట్రాక్టర్లను ప్రభుత్వం సమకూర్చింది. సొంతంగా వాహనం సమకూర్చుకునే రైతులకు దూరాన్ని బట్టి ప్రభుత్వం అద్దె జమ చేస్తుందని అధికారులు తెలిపారు. ధాన్యం సేకరణకు 8 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటికే 3 లక్షల గోనె సంచులను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది.

అదనపు సిబ్బంది నియామకం

ఆర్‌బీకే అసిస్టెంట్‌తో పాటు 196 మంది అదనపు సిబ్బందిని, 72 మంది సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించింది. 10 కిలోల ధాన్యం గ్రేడ్ ఏ రకం రూ.2,183, గ్రేడ్ బి-రకానికి రూ.2,203 చొప్పున ప్రభుత్వం ధర చెల్లిస్తోంది.

కేటగిరీల వారీగా విభజన

ధాన్యం విక్రయించాలనే రైతులు వారి పరిధిలోని ఆర్‌బీకేలో పేరు నమోదు చేసుకోవాలి. ఆ రైతు నుంచి 24 గంటలలోపు కొనుగోలు చేస్తారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిన 21 రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

- ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు మూడు కేటగిరీలు విభజన చేస్తారు. రెండు వేల మెట్రిక్ టన్నులు దాటితే 'కేటగిరి-ఏ' లో సేకరిస్తారు. ఇలా ఆరు ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వెయ్యి నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల మధ్య ఉంటే కేటగిరి-బి' కింద 22 ఆర్‌బీకేలు, వెయ్యి మెట్రిక్ టన్నుల లోపు ఉంటే కేటగిరి-సిగా 44 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.
- జిల్లాలో దేవరాపల్లి, నాతవరం, గొలుగొండ, చోడవరం, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, మాడుగుల, కోటవురట్ల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతోంది. మిగతా మండలాల్లో రైతులు వరి పంటను కుప్పలుగా వేశారు. వారి సొంత అవసరాల కోసం నూర్పులు చేస్తున్నారు.

అన్ని ఆర్‌బీకేల్లో కొనుగోలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. పేరు నమోదు చేసుకున్న 24 గంటలలోపే కల్లాల వద్దకు అధికారులు వెళ్లి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన 21 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. మిల్లర్లు, ట్రాక్టర్లు, గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయి.

– జయంతి, పౌర సరఫరాల శాఖ అధికారి, అనకాపల్లి జిల్లా

అపురూపం.. ఆ ప్రార్థన మందిరం

- 1939లో సుంకరమెట్టలో చర్చి ప్రారంభం
- కెనడా దేశస్తుడు రాల్ఫ్ స్మిత్ నిర్మాణం
- క్రిస్మస్ ప్రార్థనలకు పూర్తయిన ఏర్పాట్లు


సుంకరమెట్టలోని చర్చి

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని మొట్టమొదటి చర్చిగా గుర్తింపు పొందిన సుంకరమెట్టలోని క్రైస్తవ ప్రార్థన మందిరానికి 84 ఏళ్ల చరిత్ర నెలకొంది.అరకులోయ-విశాఖ ప్రధాన రోడ్డులో రోడ్డు పక్కన ఉన్న కొండపై నిర్మించిన అందమైన ఈ పురాతన ప్రార్థన మందిరం పర్యాటకులతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఎంతో ఆకర్షిస్తోంది. పర్యాటక, క్రైస్తవుల ప్రార్థన మందిరంగా సుంకరమెట్ట చర్చి గుర్తింపు పొందింది. ఈ ఏడాది కూడా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపేందుకు క్రైస్తవ కుటుంబాలు తగిన ఏర్పాట్లు చేస్తున్నాయి 1939లో కెనడా దేశానికి చెందిన రాల్ఫ్‌స్మిత్ క్రైస్ట్ బాప్టిస్ట్ చర్చిని గిరిజనుల సహకారంతో నిర్మించి ప్రారంభించారు. 1937లో నిర్మాణ పనులను కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ ఓవర్‌సిస్ పనుల్లో భాగంగా కెనడా దేశస్తుడు రాల్ఫ్ స్మిత్ నాయకత్వంలో ఇ.ఎల్ క్లర్క్, ఎ.డి.మాల్సిన్, జిడి బార్స్‌లు చర్చి పనుల్లో భాగస్వాములయ్యారు. చర్చి ప్రారంభం తరువాత. రాల్ఫ్ స్మిత్ 1941 వరకు ఈ ప్రార్థన మందిరంలో ఉండి తర్వాత తన స్వదేశమైన కెనడాకు వెళ్లిపోయారు. ఆ తర్వాత 1949లో విక్టర్ జోషఫ్ ఓల్ట్ మినిస్ట్రిగా సుంకరమెట్ట చర్చికు నియమితులయ్యారు. సీబీఎం సంఘం ఆధ్వర్యంలోనే సుంకరమెట్ట ప్రార్థన మందిరం కొనసాగుతుంది.

ఏజెన్సీలో తొలి చర్చి

కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ విశాఖలోని 1927 నుంచి ఫీల్డ్ మిషనరీ ద్వారా క్రైస్తవ సేవా కార్యక్రమాలన్నీ ఇ.ఎల్.క్లర్క్ ద్వారా జరిగేవి. విశాఖపట్నం, భీమునిపట్నం, విజయనగరం, ఎస్.కోట, సబ్బవరం, అనకాపల్లి, పరవాడ, యలమంచిలి తదితర ప్రాంతాల్లో సీబీఎం ప్రార్థన మందిరాలను నిర్మాణ బాధ్యతలతో పాటు ఇ.ఎల్.క్లర్క్ క్రైస్తవ బోధనలు చేపట్టేవారు. ఈ నేపథ్యంలో కెనడా దేశంలోని కెనెడియన్ బాపిస్ట్ మిషన్‌ను ఆయన సహాయం కోరారు. ఈ విషయమై కాకినాడలోని క్రైస్తవ గ్రంథాలయంలో ఆధ్యాత్మిక పత్రిక నిర్వహిస్తున్న రాల్ఫ్ ఇ.స్మిత్‌ను ఇ.ఎల్ క్లర్క్ సంప్రదించారు. రాల్ఫ్ ఇ.స్మిత్ సువార్త కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇందులో భాగంగా ఆయన 1903లో కాకినాడకు వచ్చారు. 1927లో విశాఖపట్నంలో ఇ.ఎల్.క్లర్క్‌కు సహాయకుడిగా రాల్ఫ్ ఇ.స్మిత్ చేరారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీలో తొలి ప్రార్థన మందిరం నిర్మించాలని యోచించారు. సుంకమెట్టలో చర్చి నిర్మాణానికి కెనడా బాప్టిస్ట్ మిషన్ నుంచి అనుమతులు రావడంతో నిర్మాణ పనులకు నాంది పలికారు. ఒడిశాలోని జైపూర్ వెళ్లి అక్కడ మహారాజ్ విక్రమ్‌దేవ్‌ను కలిసి క్రైస్తవ ప్రార్థన మందిర నిర్మాణానికి స్థలం, ఇతర అనుమతులను రాల్ఫ్ స్మిత్ కోరారు. హిందుమతంపైనే మహారాజులు విశ్వాసం ఉన్న ఆ రోజుల్లో జైపూర్ మహారాజు ఈ క్రైస్తవ మందిరానికి అనుమతులు జారీ చేయడం కూడా చరిత్రలో నిలిచింది. స్థానిక గిరిజనుల సహకారంతో కెనడా దేశస్తుడు రాల్ఫ్ స్మిత్ సీబీఎం మిషన్ ద్వారా సుంకరమెట్ట కొండపై క్రైస్తవ ప్రార్థన మందిరాన్ని నిర్మించి క్రైస్తవ కుటుంబాలకు అంకితం చేశారు. ప్రస్తుతం ఈ ప్రార్థన మందిరం క్రైస్తవ కుటుంబాలకు ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక ప్రాంతంగా కూడా అలరిస్తుంది. ఈ అనుబంధ సీబీఎం చర్చిలు కూడా ఏజెన్సీ వ్యాప్తంగా సేవలందిస్తున్నాయి. అపురూపంగా సుంకరమెట్ట సీబీఎం చర్చి నిలిచింది.

రోటరీ కప్ గోల్ఫ్ విజేత శ్రీనివాస్

విశాఖ స్పోర్ట్స్: రోటరీ గోల్ఫ్ కప్ విన్నర్‌గా కె.శ్రీనివాస్ (33 పాయింట్లతో) ఓవరాల్ నిలిచాడు. 228 యార్డ్స్ హిట్‌తో కె.వి.ఎస్.రామరాజు లాంగెస్ట్ డ్రైవ్ చేయగా 2.7 ఫీట్‌తో క్లోజస్ట్ పిన్‌గా ఎం.రఘురామ్ నిలిచాడు. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఈపీజీసీ ఆదివారం గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన పోటీల్లో 108 గోల్ఫర్లు పోటీపడ్డారు. గోల్డ్ డివిజన్‌లో కెప్టెన్ హేమంత్‌కుమార్ విజేతగా నిలవగా కె.ఎస్.ఆర్.కె.రాజు రన్నరప్‌గా నిలిచారు. సిల్వర్ డివిజన్‌లో కృష్ణకుమార్ సింగ్ విజేతగా వి.అమర్‌కాంత్ రన్నరప్‌గా నిలిచారు. ఎస్.అప్పారావు, టి.కె.రాజు ఈ విభాగాల్లో చక్కటి ప్రతిభ చూపారు. బ్రాంజ్ డివిజన్ విజేతగా ప్రణవ్ చందల్, రన్నరప్‌గా కిరీట్ వెంకట్ నిలిచారు. సీనియర్ డివిజన్ విన్నర్‌గా ఎం.బి.పాత్రుడు, రన్నరప్‌గా జి.ఆర్.జి.రెడ్డి నిలవగా మహిళల విభాగంలో ఎం.సరిత విజేతగా, ఎం.పావని రన్నరప్‌గా నిలిచారు. పోలియో నిర్మూలన ఫండింగ్ కోసం ఈ పోటీలు నిర్వహించగా వచ్చిన ఐదు లక్షల చెక్కును వినియోగించనున్నారు. విజేతలకు సంధ్య మెరైన్స్ ఎండీ కె.వి.ప్రసాద్ జ్ఞాపికలు అందించారు. రోటరీ జిల్లా గవర్నర్ వెంకటసుబ్బారావు, డైకిన్ కిషోర్‌కుమార్, మధుబాబు, ఈపీజిసి ఎంఎస్ఎన్ రాజు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి బ్రహ్మానందం,నేతాజీ, శంకర్,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ


ట్రై సైకిల్ పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్


సైకిల్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆడారి కుమార్, కాండ్రేగుల శ్రీరామ్

అనకాపల్లి : దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనే పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ (వీరబాబు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా స్థాయి ఆటల పోటీలను విద్యాశాఖ ఏడీ ఆడారి రవికుమార్, ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగుల కోటాలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అంగవైకల్యం, అంధులు, బదిరులు, మానసిక దివ్యాంగులు వారికి ట్రై సైకిల్ రేస్, బ్యాటరీ ట్రై సైకిల్ రేస్, రన్నింగ్, జావెలిన్‌త్రో, డిస్కత్రో, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ వంటి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ క్రీడాకారులకు అడిషనల్ ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది కనిశెట్టి సురేష్ బాబు, సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, మాణిక్యాల రావు, వియ్యపు రాజు, సంక్షేమ సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మార్గశిర పూజలు

డాబాగార్డెన్స్(విశాఖ): మార్గశిర మాసోత్సవాల 11వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్‌కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

హుకుంపేట: పన్నెండేళ్లు కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు 23ఏళ్ల తరవాత కలుసుకోని సంతోషం వ్యక్తం చేశారు. ఈ వేడకకు హుకుంపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల వేదికగా నిలిచింది. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశమయ్యారు. దీంతో ఈ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. పాఠశాలలో 2000వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సహపంక్తి భోజనాలు చేసి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.


ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకకు వచ్చిన పూర్వ విద్యార్థులు

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట-బల్హార్షా సెక్షన్ హసన్‌పర్తి రోడ్-ఉప్పల్ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న ఆదునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

ఈ కింది రైళ్లు దువ్వాడ-విజయవాడ-వరంగల్-బల్హార్షా మీదుగా కాకుండా మళ్లించిన మార్గంలో వయా విజయనగరం-రాయగడ- టిట్లాఘడ్- రాయ్‌పూర్- నాగ్‌పూర్ మీదుగా నడుస్తాయి.

- జనవరి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నం-న్యూఢిల్లీ -విశాఖపట్నం (20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్
- జనవరి 4, 11 తేదీల్లో విశాఖపట్నం-గాంధీదాం(20803) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 7న గాంధీదాం-విశాఖపట్నం (20804) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 1, 5, 8, 12 తేదీల్లో విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 3, 7, 10 తేదీల్లో హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం(12804) స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 7న పూరీ -ఓఖా(20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 3,10 తేదీలలో ఓఖా-పూరీ (20820) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు.

కోరాపుట్-రాయగడ్ లైన్‌లో..

వాల్తేర్ డివిజన్ దమన్‌జోడి-బాయ్‌గుడ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న రెండో లైన్ సంబంధిత పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. జనవరి 1,5 తేదీల్లో విశాఖపట్నం-కోరాపుట్(18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, జనవరి 2,6 తేదీల్లో కోరాపుట్-విశాఖపట్నం (18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

తాను చనిపోతూ.. ఆరుగురికి పునర్జన్మ

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ బ్రెయిన్‌డెడ్
- పుట్టెడు దుఃఖంలోను కుటుంబ సభ్యుల ఔదార్యం
- అవయవదానానికి సంపూర్ణ సహకారం


పూర్ణకుమారి(ఫైల్)

ఆరిలోవ: పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు చూపిన ఔదార్యం ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు ఆ కుటుంబ సభ్యులు. జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా గవరపాలెం గ్రామానికి చెందిన వెలమ పూర్ణకుమారి(53) తన కుమారుడుతో ద్విచక్రవాహనంపై ఈనెల 21న విశాఖ వస్తున్నారు. విశాఖ పోర్టు ఫ్లై ఓవర్‌పై వారి ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కిందపడిన పూర్ణకుమారి తలకు తీవ్రగాయమై అధిక రక్తస్రావం జరిగింది. దీంతో ఆమెను రామ్‌నగర్‌లో కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కేర్ ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి తలకు శస్త్ర చికిత్స చేశారు. అయినప్పటికీ ఈనెల 23 రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. మంత్రి అమర్‌నాథ్ ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయదానం కోసం ప్రోత్సహించగా అంగీకరించారు. జీవన్‌ధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబుతో మాట్లాడి అవయదాన ప్రక్రియ ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఆమె గుండె, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలు, లివర్ తొలగించి అవసరమైన వారి కోసం తరలించినట్లు డాక్టర్ రాంబాబు తెలిపారు. అవయదానం చేయడానికి ముందుకు వచ్చిన పూర్ణకుమారి కుటుంబ సభ్యులను డాక్టర్ రాంబాబు అభినందించారు. పూర్ణకుమారికి భర్త జగదీశ్వరరావు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అర్హులకు సహకార బ్యాంకుల రుణాలు

ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందప్రసాద్

రావికమతం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా రుణాలందించి చేనేత సొసైటీలను ఆదుకోవాలని, వస్త్ర ఉత్పత్తికి అవసరమయ్యే ముడి సరుకులు, రంగు రసాయనాలు ఉచితంగా అందించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్ అన్నారు.ఆ సంఘం రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం కొత్తకోటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నిరుద్యోగంతో ఉన్న చేనేత కార్మికుల పిల్లలకు నూతన టెక్నాలజీతో కూడిన శిక్షణ ఇప్పించి ప్రభుత్వం ఉపాధి చూపాలన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని, వేతనాలు బ్యాంకుల ద్వారా త్వరితగతిన అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పుష్ప రాజారావు, ఏపి రాష్ట్ర అధ్యక్షుడు శివరామ ప్రశాద్, కార్యదర్శి రమణ మహేష్, గౌరవాధ్యక్షుడు నాళి అప్పారావు, చేనేత విభాగం కార్యదర్శి పప్పు వెంకట రమణ పాల్గొని రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు గూర్చి వివరించారు. చేనేత కార్మికులకు, రావికమతం మండలంలో టైలర్లకు సొసైటీల ద్వారా ఆప్కో సంబంధిత అధికారులతో చర్చించి 50 ఏళ్లు నిండిన వారందరికీ పింఛన్లు వచ్చేలా చూడాలని ఒక వినతి పత్రాన్ని మండల నాయకులు చల్లా సత్యారావు, బేతా రాజారావు, వైఎస్ఆర్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బేతా పాండు, శెలా నాగేశ్వరరావు సభలో అందించారు.

'పుంగనూరు చరిత్ర-నాతో నేను' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ లజపతిరాయ్, సాహితీవేత్త సూర్యారావు, డాక్టర్ చైతన్యరెడ్డి, డాక్టర్ లక్ష్మీ సంగీత

డాబాగార్డెన్స్: చరిత్రతోనే రెండు ప్రాంతాల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని ప్రొఫెసర్ లజపతిరాయ్ అన్నారు. డాక్టర్ ఎం రామచంద్రారెడ్డి రచించిన 'పుంగనూరు చరిత్ర–నాతో నేను' పుస్తకావిష్కరణ ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. రచయిత, సాహితీవేత్త సూర్యారావు, డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి, డాక్టర్ లక్ష్మీ సంగీత దంపతులతో కలిసి ఆయన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని కళలు, పర్యాటకం, ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ ఓ పుస్తకం తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ రామచంద్రారెడ్డి 90 ఏళ్ల వయసులో ఎంతో కష్టపడి పుంగనూరు చరిత్రను రచించారని, మిగిలిన ప్రాంతాలకు పుంగనూరు చరిత్ర తెలియజేయాలన్న అతని తనయుడి చైతన్యరెడ్డి ఆకాంక్ష అభినందనీయమన్నారు. పుంగనూరుకు గొప్ప చరిత్ర ఉందని, ఆలయాల పట్టణం అని కూడా పిలవవచ్చని తెలిపారు. డాక్టర్ చైతన్యరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే విశాఖపట్నంకు ఓ చరిత్ర ఉందన్నారు.తాను విశాఖలోనే వివాహం చేసుకున్నానని, మెడికల్ పీజీ ఇక్కడే చేశానని చెప్పారు. 1976లో మెడిసిన్ పూర్తి చేసిన తన తండ్రి రామచంద్రారెడ్డి ఎన్నో పుస్తకాలు రాసినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రచురణ కాలేదన్నారు. శ్రీశ్రీ రాసిన పుస్తకంలో తన తండ్రి రాసిన కవిత ఉందన్నారు. ఈ పుస్తకం రాసేందుకు ఆయనకు రెండేళ్లు పట్టిందని.. సమాజంలో రుగ్మతలు, డాక్టర్‌గా అందించిన సేవలతో పాటు పుంగనూరు విశేషాలన్నీ ఈ పుస్తకంలో పొందుపరిచారని చెప్పారు. సాహితీవేత్త సూర్యారావు మాట్లాడుతూ ప్రాంతీయ పోరాటాల యుగమిదని, ఒక ప్రాంత చరిత్ర మిగిలిన ప్రాంతాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి యువత సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలన్నారు. తెలుగు సాహిత్యం అపురూపమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సురేష్‌బాబు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.